

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



వైభవంగా కృత్తికా దీపోత్సవం

రేపల్లె రూరల్: మార్గశిర మాసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివలింగాకృతిలో దీపాలను భక్తులు వెలిగించారు.

భక్తితో హనుమద్ వ్రతం



మంగళగిరి: నగర పరిధిలోని హనుమంతుడి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. హనుమద్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాక్షి గుంటూరు

శనివారం । 14 । డిసెంబర్ । 2024

అటకెక్కిన హామీలు

- గుంటూరు తూర్పు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ... రైతులను అందలం ఎక్కించిన ఘనత మహానేత వైఎస్సార్‌కు దక్కితే.. మరో రెండు అడుగులు ముందుకు వేసి వారిని ఆదుకున్న ఖ్యాతి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీలను కేవలం గద్దెనెక్కడానికి ఇచ్చారని తెలిపారు. ప్రజలకు ఈ విషయం అర్థమైందని చెప్పారు. పథకాలు సైతం అటకెక్కాయని మండిపడ్డారు. ప్రజలకు మంచి జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు.

కొట్టుకుపోవడం ఖాయం

- మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ... ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వంపై రైతుల పక్షాన చేపట్టిన కార్యక్రమంతోనే పోరు మొదలైందన్నారు. రైతన్నకు పెద్దపీట వేసిన మహానుభావుడు వైఎస్సార్ అని, ఆయన అడుగుజాడల్లో వైఎస్ జగన్ నడిచారని తెలిపారు. రైతుకు ఏ కష్టం కలగకుండా చూసుకున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా ఇస్తానన్న రూ.20 వేల సాయం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేసే వారు లేక, గిట్టుబాటు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతు కన్నీరు పెడితే.. ఆ కన్నీటిలో కూటమి సర్కారు కొట్టుకుపోక తప్పదని హెచ్చరించారు.

అన్నదాతలకు కన్నీరే..

- పొన్నూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ... కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైఎస్ జగన్ సారథ్యంలో పోరాడుతామన్నారు. రైతులతో నేరుగా మాట్లాడితే కన్నీరు వచ్చే పరిస్థితి ఉందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. పొన్నూరు నియోజకవర్గాన్ని, రైతుల సమస్యలను వదిలేసిన ఎమ్మెల్యే... గుంటూరులో తిరుగుతున్నారని విమర్శించారు.

సర్కారు చిన్నచూపు

- డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ర్యాలీకి నేతృత్వం వహించి మాట్లాడుతూ... ప్రజలు, రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పెట్టుబడి వస్తే చాలనుకునే పరిస్థితుల్లో అన్నదాతలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. రైతుల కళ్లలో ఆనందం చూసే వరకు తమ పార్టీ తరఫున పోరాడతామన్నారు.

పోరాటం ఆగదు..

- నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ... రైతన్నకు అండగా ఉండి, గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇది సిగ్గుచేటన్నారు. హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా వ్యవహరించారని గుర్తుచేశారు. రైతులకు న్యాయం చేసేవరకు కూటమి ప్రభుత్వంపై ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

అన్నం పెట్టే రైతన్నకు అండగా వైఎస్సార్ సీపీ దండు కదిలింది. కూటమి ప్రభుత్వం తీరుతో అన్నదాతకు గుండె బేజారైన వేళ ధైర్యం చెబుతూ ఉద్యమ గళమై భరోసా ఇచ్చింది. పాలకుల నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధమైంది. ఆరుగాలం శ్రమించి కర్షకులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించలేని సర్కారు మొద్దు నిద్ర వదిలేలా నిరసన గళమై రైతు స్వరాన్ని వినిపించింది. వెంటనే మొత్తం ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించింది.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు. వేదికపై ఆ పార్టీ నేతలు

రైతు స్వరమై.. ఉద్యమ గళమై..!

- రైతుల సమస్యల పరిష్కారానికి గళమెత్తిన నాయకులు
- కూటమి సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ నిరసన ప్రదర్శన
- జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కర్షకులతో కలిసి భారీ ర్యాలీ
- సమస్యలన్నీ తీర్చాలని అధికారులకు డిమాండ్ పత్రం

అన్నదాతలకు మద్దతుగా కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గుంటూరులో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, అప్పిరెడ్డి, వజ్రబాబు, ఏసురత్నం, మురళీకృష్ణ, నూరిఫాతిమా, బలసాని తదితరులు

పట్నంబజారు: రైతుల పక్షాన రాజీ లేని పోరుకు సిద్ధమని వైఎస్సార్ సీపీ నాయకులు తేల్చి చెప్పారు. అన్నం పెట్టే రైతు కన్నీరు పెడితే ఆ కన్నీటిలో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోవటం తథ్యమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి వెళ్లి అధికారులకు రైతాంగ సమస్యలపై డిమాండ్ పత్రం అందజేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, నగర అధ్యక్షుడు వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తెనాలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ హాజరయ్యారు.

ముఖ్య నాయకులు ఏమన్నారంటే...

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ... రైతే రాజు అని చాటి చెప్పిన ఘనత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తర్వాత కుమారుడు వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రైతు ఊసే పట్టించుకోని చంద్రబాబు సర్కార్... ఏ అంశం తీసుకున్నా అది వైఎస్ జగన్ పరిపాలన కారణం అంటూ నిందలు మోపటం సరికాదన్నారు.
- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ... రైతన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్‌బీకే సెంటర్ల ద్వారా రైతులను ఆదుకుని, రైతుకు మేలు జరిగేలా వ్యవస్థలను పని చేయించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేశామని తెలిపారు. రైతుల కష్టాలను చూడలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు శివరామకృష్ణ, ఓంప్రకాష్, సీడీ భగవాన్, బత్తుల దేవా, మెట్టు వెంకటప్పారెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, షేక్ మస్తాన్ వలి, పోకల వెంకటేశ్వర్లు, మందేపూడి పురుషోత్తం, పిల్లి మేరీ, కొలకలూరి కోటేశ్వరరావు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, ఆళ్ళ రవిదేవరాజు, ఏటుకూరి విజయసారథి, కార్పొరేటర్లు, పార్టీ నేతలు, డివిజన్, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

> **ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం**

అంబటి రాంబాబు మాట్లాడుతూ... రైతులకు మద్దతు ధర కల్పించటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గిట్టుబాటు ధర రూ.1,740గా ఉన్నా, దళారులు రూ.1,300 మాత్రమే ఇస్తున్నారని గుర్తుచేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సొంత నియోజకవర్గంలోని కొల్లిపర మండలంలో 31వేల మెట్రిక్ టన్నులు పండితే.. కేవలం 1,400 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. స్వయంగా ఆయన నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ప్రతి గింజ కొంటామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కంటే రూ.100 నుంచి రూ.200 వరకు అధిక ధర కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రైతన్న కష్టంలో ఉన్నప్పుడు మేలు చేయాల్సిన ప్రభుత్వం అందరిని కలిపి మిల్లర్లకు అప్పగించిందని ధ్వజమెత్తారు. గత్యంతరం లేక రైతన్న కన్నీరు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదీ రైతు వ్యతిరేక ప్రభుత్వం అని.. రైతులకు ద్రోహం చేసిన పాపం ఊరికే పోదని దుయ్యబట్టారు. రైతులకు అండగా వైఎస్ జగన్ ఏటా రూ 13,500 అందజేస్తే.. అధికారంలో వచ్చాక రూ. 20వేలు ఇస్తామని చెప్పిన కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ అంటూ మాటలకే పరిమితం అయిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతుల సమస్యలు తెలుసుకుంటే ఎంతో బాధ కలిగిందన్నారు. చంద్రబాబుకు పొరపాటున ఓటు వేశామనే పరిస్థితికి రైతులు, ప్రజలు వచ్చేశారన్నారు. అన్నదాతలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మంత్రులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.



ప్లకార్డుతో మోదుగుల

ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు

పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ... సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను నట్టేట ముంచుతూ చంద్రబాబు మోసం చేశారన్నారు. పథకాలలో ఏ ఒక్కటీ అమలు కాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కనీసం రైతుల గోడు వినే పరిస్థితుల్లో కూడా కూటమి ప్రభుత్వం లేదని మండిపడ్డారు. రైతు కష్టాన్ని నేరుగా చూసిన వైఎస్ జగన్... ఆర్‌బీకే సెంటర్‌ల ద్వారా అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమ లేఅవుట్‌లతో పంట పండే పొలాలను సైతం నిర్వీర్యం చేసే దిశగా ముందుకు సాగుతోందని మండిపడ్డారు. జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందంటున్నారని, కచ్చితంగా వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆ బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నిత్యం ప్రజల కోసం పోరాడే పార్టీ అని స్పష్టం చేశారు. అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలని హెచ్చరించారు.



ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు

చేతనైతే ప్రజలకు మేలు చేయండి...

- తెనాలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ.... వైఎస్సార్ సీపీ నేతలపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించటం కూటమి సర్కారు మానుకోవాలని పేర్కొన్నారు. చేతనైతే ప్రజలకు మేలు చేయాలన్నారు. వైఎస్ జగన్ హయాంలో రైతులకు ఏటా రూ.13,500 అందజేస్తే, కూటమి ప్రభుత్వం కనీసం గిట్టుబాటు ధర కూడా అందించలేని దుస్థితిలో ఉందని తెలిపారు. ప్రతి ఫెయిల్యూర్‌ను వైఎస్సార్ సీపీకి అంటగడుతూ.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు తక్కువ ధాన్యమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గల్లా మాధవి గడ్డిబొమ్మ దహనం



తెనాలి: స్థానిక హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక గాంధీచౌక్‌లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి గడ్డిబొమ్మ దహనం చేశారు. భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులను ఎమ్మెల్యే అడ్డుకున్నందున హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో పాట్టి మూర్తి, శ్రీనివాసు, శేఖరమూర్తి, అంబటి మారుతీరామ్, అవ్వారు శ్రీనివాసరావు, రమాదేవి, రజని, పొత్తూరు నాగేంద్రం పాల్గొన్నారు.


పుస్తకాల విక్రయాలు ఆపడం తగదు

ఫిరంగిపురం: గీతాసారాంశం పుస్తకాలు అమ్మొద్దని ఎమ్మెల్యే మాధవి చెప్పడం హేయమని బీజేపీ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరు పట్టణంలో ఇస్కాన్ భక్తులు గీతాసారాంశం పుస్తకాలు విక్రయించడాన్ని ఎమ్మెల్యే అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అవగాహన లేకుండా ఆమె మాట్లాడటం పద్ధతి కాదన్నారు. వెవీ సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు వి.హరిబాబు, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గసభ్యుడు జి. చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఎస్.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'లత'లా అల్లుకున్న అవినీతి

గుంటూరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నుంచి డీటీసీపీ వరకు ఎగబాకుతున్న అమ్యామ్యాల పంపకాలు

- సూత్రధారి అక్కడ డీటీసీపీలో మహిళా డాన్
- పాత్రధారి ఇక్కడ నకిలీ 'బాబు'
- లంచావతారులకు అందలం
- పరిపాలనా సౌలభ్యం పేరిట ఇష్టారాజ్యంగా నియామకాలు
- డీటీసీపీని మచ్చిక చేసుకుంటే కోరుకున్న పోస్టింగ్‌లు
- టౌన్ ప్లానింగ్ విభాగంలో వెలుగు చూస్తున్న అవినీతి అనకొండలు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: అవినీతి పరులను, ఏసీబీ కేసుల్లో ఉన్న వారిని కీలక పోస్టుల్లో నియమించడానికి టౌన్ ప్లానింగ్‌లో పెట్టుకున్న ముద్దుపేరు పరిపాలనా సౌలభ్యం! రెండుసార్లు ఏసీబీ దాడుల్లో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన వ్యక్తికి ఫోకల్ పోస్టింగ్ ఇవ్వడంతోపాటు నగరంలో సగం డివిజన్లు అప్పగించడం వెనుక వారు చెబుతున్న కారణం ఇదే. ఈ పోస్టింగ్‌కు తమకు సంబంధం లేదని, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఆ పోస్టు ఇవ్వాల్సి వచ్చిందని గుంటూరు మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై కథనాలుగా వస్తున్నా.. ఈ వసూళ్ల దందా.. ప్రణాళికా విభాగానికే పరిమితం కాకుండా రాజధానిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ వరకు చేరుతున్నట్లు సమాచారం. ప్రణాళిక విభాగం ఉద్యోగులంతా డీటీసీపీలో భాగమే. వారి ప్రమోషన్లు, పోస్టింగులు డీటీసీపీ నుంచే జరుగుతాయి. కార్పొరేషన్‌లో ఎంత వసూలు చేయాలి? ఎంత డీటీసీపీకి పంపాలి? అనేది అక్కడ ఉన్న ఒక ప్రధాన మహిళా అధికారి నిర్ణయిస్తున్నట్లు సమాచారం. వీరి పోస్టింగులు, ప్రమోషన్లు ఇచ్చేందుకు ఉన్న ప్రమోషన్ కమిటీలపై అజమాయిషీ కూడా ఆ ఆమెదే. అర్హత లేకున్నా ఆ అధికారి అనుకుంటే ప్రమోషన్, ఏసీబీ వలలో చిక్కినా ప్రధాన పోస్టింగ్‌లు దక్కుతాయని ఇక్కడ ఉద్యోగులు కథలు కథలుగా చెబుతుంటారు. గుంటూరులో పనిచేస్తూ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన అధికారి మళ్లీ గుంటూరులోనే పోస్టింగ్ తెచ్చుకోవడమే దీనికి ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఇలాంటి ధీమాతో టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతిలో చెలరేగిపోతున్నారు. వారానికి టార్గెట్లు పెట్టుకుని మరీ వసూళ్ల దందా మొదలు పెట్టారు. జీఎంసీలో కీలకంగా ఉండే అధికారి తన కింద అంతా గతంలో ఏసీబీ కేసుల్లో రెడ్ హ్యాండెడ్‌గా దొరికి, సస్పెండ్ అయిన వ్యక్తుల్ని, వివిధ మున్సిపల్ కమిషనర్లు వెనక్కి పంపించేసిన ఉద్యోగులకు ఇక్కడ పోస్టింగ్‌లు ఇప్పించుకుని వసూళ్ల పర్వం మొదలుపెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అధికారి గతంలో విశాఖపట్నంలో ఉన్నప్పుడు.. ఇప్పుడు డీటీసీపీలో ఉన్న 'ఆమె' వద్ద పనిచేశారు. అప్పట్లో అనేక అక్రమాలకు పాల్పడిన విషయాలు వెలుగు చూస్తున్నాయి. బిల్డర్ లేఅవుట్లలో ఉన్న రోడ్డు లేనట్టు, లేనివి ఉన్నట్టు నోటీసులు ఇవ్వడం, వారి దగ్గర నుంచి భారీగా డబ్బు డిమాండ్ చేయడం ఈయనకు అలవాటేనని తెలిసింది.

వసూళ్లకు ఆటంకంపై ఆందోళన

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటన మేరకు కొత్త జీఓ ప్రకారం 95% బిల్డింగ్ ప్లాన్లు ఎల్‌టీపీలే ఆమోదించి ప్రభుత్వానికి ఆన్‌లైన్లో ఫీజు కట్టే విధంగా సవరించనున్నారు. అప్పుడు రూ.కోట్లు దండుకునే అధికారాలకు కత్తెర పడుతుందని వారు భయపడుతున్నారు. ఆ జీవో అమలు కాకుండా ఎల్‌టీపీలపై ఒత్తిడి తీసుకురావడం, వారి ఆధీనంలో ఉన్న సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు సృష్టించడం చేస్తున్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్లకు ప్రణాళికా విభాగంలో కొంత మేరకే అవగాహన ఉండడంతో ఐఏఎస్ అధికారులను తప్పుదోవ పట్టించి, జరిగే తప్పులకు వారిని బాధ్యులను చేసేలా వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం డబ్బు దందాగా పెట్టుకున్న 1187 షార్ట్ ఫాల్ నోటీసుల విషయంలో పూర్తి విచారణ జరిపితే అనేక అక్రమాలు, వసూళ్ల వివరాలు బహిర్గతమయ్యే అవకాశాలు లేకపోలేదు. ప్లానింగ్ అధికారులు, బిల్డర్‌లతో కుమ్మక్కు కావడం వల్లే మున్సిపల్ ఆదాయాన్ని తుంగలో తొక్కి వీరి వ్యక్తిగత ఆదాయాలు పెంచుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఈ స్థాయిలో అవినీతి జరుగుతున్నా స్థానిక అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వెనక చిదంబర రహస్యం ఏమిటో వారికే తెలియాలి.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా శాఖ



గుంటూరు మెడికల్: పులివెందుల నియోజకవర్గంలో జర్నలిస్టులపై జరిగిన దాడిని ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా శాఖ తరఫున నేతలు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన సమావేశంలో ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఎస్.ఎన్.మీరా, కె.రాంబాబు, పుల్లగూర భక్తవత్సలరావు, గిరిధర్ కుమార్, ఒ.మార్కండేయులు, పి. శ్రీనివాసరావు, ఎస్.నాగరాజు, ఎస్.రాజా సాహెబ్, టి.నాగేశ్వరావు, ఎస్‌కేఎండీ షరీఫ్, కె.రత్నాకర్, శ్యాంనాయక్, కరీం, రాంప్రసాద్, ఎం.మొగులయ్య, వి.కిరణ్‌కుమార్, ఎం.వి.సుబ్బారావు, జె.ఆనందబాబు, ఆర్.సౌరయ్య, జి.వెంకటేశ్వరరావులు దాడిని తీవ్రంగా ఖండించిన వారిలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,800** గరిష్ఠం : రూ. **2,400**

మోడల్ ధర రూ. **2,100**

క్లుప్తంగా

పాత్రికేయులపై దాడి హేయం


తాడేపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు


తాడేపల్లి రూరల్ : పాత్రికేయులపై జరిగిన దాడులను ప్రెస్‌క్లబ్ తాడేపల్లి అధ్యక్షులు జొన్న వెంకటేష్, కార్యదర్శి తక్కెళ్లపాటి శివనాగిరెడ్డిలు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే పాత్రికేయులపై తెలుగు రాష్ట్రాల్లో దాడులు చేస్తున్నారని, బాధ్యులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. గాయపడిన విలేకరులకు అయ్యే వైద్య ఖర్చులను ప్రభుత్వం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ తాడేపల్లి వద్ద నిరసన వ్యక్తం చేసి గుండిమెడలో రెవెన్యూ సదస్సులో ఉన్న తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్యకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ తాడేపల్లి గౌరవ అధ్యక్షుడు జొన్న రాజేష్, ఉపాధ్యక్షుడు కటికల కమల్ కుమార్, సంయుక్త కార్యదర్శి నల్లపు కిషోర్ బాబు, కోశాధికారి వామర్తి సుబ్రహ్మణ్యం, సభ్యులు రాయపూడి చినబాబు, తుడిమెల్ల రాంబాబు, పాణెం ప్రదీప్, సందీప్, మంగళగిరి పాత్రికేయులు అవ్వారు శ్రీనివాసరావు, నాగిరెడ్డి, ప్రకాష్ బాబు, చిన్ని, అన్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: మహిళపై అత్యాచారానికి పాల్పడి, బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దిశ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు రోడ్డులోని ఓ ప్రాంతంలో బడ్డీకొట్టు నిర్వహించే మహిళకు రెండు సంవత్సరాల క్రితం వెంగళాయపాలెంకు చెందిన దేవరకొండ నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. మహిళను శారీరకంగా లొంగదీసుకున్న నాగేశ్వరరావు.. వీడియో చిత్రీకరించారు. దానిని చూపించి బెదిరిస్తూ బాధితురాలి నుంచి పలు దఫాలుగా డబ్బులు వసూలు చేశాడు. తరచూ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళకు వివాహమై ఇరువురు సంతానం ఉన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే భర్తతోపాటు బిడ్డలను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

కాస్త ఊపిరి పీల్చుకుందాం..!

- న్యుమోనియాపై అప్రమత్తత ముఖ్యం
- ముందు జాగ్రత్తలతో ఎంతో మేలు
- వ్యాధి వస్తే ప్రాణాలు పోయే ప్రమాదం
- చలికాలంలో ఎక్కువగా కేసులు నమోదుకు అవకాశం



గుంటూరు మెడికల్ చలికాలం పలు రకాల వ్యాధులు సోకుతాయి. వాటిల్లో ముఖ్యంగా ఊపిరి తిత్తులకు సంబంధించినవి నిద్రలేకుండా చేస్తాయి. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయకపోతే కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వాటిల్లో న్యుమోనియా ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అప్పుడే పుట్టిన పిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు న్యుమోనియాతో చనిపోతున్నారు. ప్రతి ఏడాది ఐదేళ్లలోపు పిల్లలు రెండు మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడి చనిపోతున్నారు. చలికాలంలో న్యుమోనియా సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు.

లక్షణాలు ఇవీ...

ఈ వ్యాధి అన్ని వయస్సుల వారికి వస్తుంది. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వ్యాధి బారిన పడుతున్నారు. దగ్గు, కళ్లె పడటం, కళ్లె పసుపు లేదా పచ్చగా ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఆయాసం, అలసట, చాతీలో నొప్పి, ఊపిరి పీల్చుకోవటం కష్టంగా ఉండటం, జ్వరం, చలి, వణుకు ఉండటం, తలనొప్పి, కండరాల నొప్పులు, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవటం లేదా తక్కువగా కొట్టుకోవటం, వికారం, వాంతులు, విరేచనాలు, పిల్లలు పాలు తాగలేకపోవటం తదితర లక్షణాలు వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి. చలికాలంలో న్యుమోనియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆడవారితో పోల్చితే మగవారిలోనే వ్యాధి బాధితులు ఎక్కువగా ఉంటున్నారు.

కారణాలు...

వ్యాధి ఉన్న వ్యక్తి ముఖానికి కర్చీఫ్ పెట్టుకోకుండా దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపర్ల ద్వారా పక్కన ఉండే వారికి వ్యాధి సోకుతుంది. వైరస్, బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిలో, పొగతాగేవారిలో, మద్యపానం చేసేవారిలో, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. చాతీ ఎక్స్‌రే, సీటీ స్కాన్, రక్త పరీక్షలు, కళ్లె పరీక్ష, బ్రాంకోస్కోపీ, పల్స్ ఆక్సీమెట్రీ, ఫ్లూయిడ్ కల్చర్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారణ చేస్తారు. జిల్లాలో 150 మంది పిల్లల వైద్య నిపుణులు, 50 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ ఇద్దరు బాధితులు చికిత్స కోసం వస్తున్నారని చెబుతున్నారు.

వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చు



న్యుమోనియా సోకకుండా నివారించే వ్యాక్సిన్‌లు పిల్లలకు, పెద్దవారికి అందుబాటులో ఉన్నాయి. వ్యాధి రాకుండా ముందస్తుగా పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్‌లు చేయించాలి. ప్రభుత్వం కూడా ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలకు వ్యాక్సిన్లు వేస్తోంది. విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్ వినియోగించకూడదు. పబ్లిక్ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్ అడ్డుపెట్టుకోవటం చాలా మంచిది.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

జాగ్రత్తలు తీసుకోవాలి...



వ్యాధి బాధితులు త్వరగా కోలుకోవటానికి వైద్యులు రాసిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం చేయకూడదు. దగ్గినా, తుమ్మినా ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి. తరచుగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజులపాటు వ్యాయామం చేయాలి. చాతీ సమస్యలను ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యనిపుణులను సంప్రదించాలి.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

ఫెర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్‌తో పాటు సీఐలు కె.చంద్రశేఖర్, పి. శివాజీ, విజిలెన్స్ ఏవో ఆదినారాయణల బృందం స్థానిక ఏవో కె. అరుణకుమారితో కలిసి మంజునాథ ట్రేడర్స్, పయనీర్ ఆగ్రోస్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేసింది. రికార్డులు, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లును పరిశీలించారు. ఎస్పీ స్వయంగా గోడౌన్లకు వెళ్లి తనిఖీ చేశారు. స్టాకు వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. దీంతో మంజునాథ ట్రేడర్స్‌లో రూ. 2,02,348 విలువ చేసే 11.36 మెట్రిక్ టన్నుల ఎరువులు, పయనీర్ ఆగ్రోస్‌లో రూ. 1,96,300 విలువ చేసే 11.5 మెట్రిక్ టన్నుల ఫెర్టిలైజర్స్‌ను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. ఈ మేరకు ఆయా దుకాణాల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

నగరంపాలెం: బాపట్ల జిల్లాలోని చీరాలలో శ్రీఅన్నపూర్ణ ఫెర్టిలైసెర్స్, ఎం/ఎస్ సుభాష్ జనరల్ స్టోర్, శ్రీసుబ్రమణ్యేశ్వర ఫెర్టిలైజర్‌లో 52.65 ఎంటీఎస్ ఎరువులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని సూర్య శ్రావణ్ కుమార్ సూచించారు. సుమారు రూ.9.60 లక్షల విలువ చేసే 75.71 ఎంటీఎస్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు.

మతిభ్రమించినట్టు మంద కృష్ణ చర్యలు

- 15న మహాగర్జనలో మాలలు సత్తా చాటాలి
- ఏజీ జేఏసీ కన్వీనర్ అన్నవరపు కిషోర్

తెనాలి: తెలంగాణ మాల సింహ గర్జన చూసి మందకృష్ణకు మతిభ్రమించినట్టు ఉందని, ఏడో తరగతి చదివిన మందకృష్ణ.. మాల మేధావులను చర్చలకు పిలవడం హాస్యాస్పదమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, అఖిలభారత మాల సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని కోరుతూ జనసమీకరణలో భాగంగా శుక్రవారం ఆయన తెనాలి వచ్చారు. స్థానిక అయితానగర్‌లోని మాలల మహా గర్జన జేఏసీ కార్యాలయంలో 'హలో మాల–చలో గుంటూరు' కరపత్రాన్ని ఆవిష్కరించారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతూ, వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన సూచనలు మాత్రమే చేసిందని గుర్తుచేశారు. దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం దీనిపై కమిషన్ నియామకాన్ని కూడా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. రిజర్వేషన్ ఫలాలను మాలలు అనుభవిస్తూ దోచుకుతింటున్నారని 30 ఏళ్ల నుంచి మందకృష్ణ నమ్మిస్తూ విష ప్రచారంతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన మాలలు ఈ నెల 15వ తేదీన గుంటూరులో జరిగే మహా గర్జన సభలో తమ సత్తా చాటుతారని అన్నారు. జేఏసీ నాయకుడు యండ్రపాటి అశోక్ కుమార్, జేఏసీ మాల నాయకుడు బండికళ్ల బుల్లయ్య , బి.ప్రదీప్, డాక్టర్ కారుమంచి రవికుమార్, కంచర్ల కోటేశ్వరరావు, కె. సునీల్, జ్యోతుల బాబి, పిల్లి ప్రేమ్‌కుమార్, కొల్లూరి కిరణ్, పిల్లి తిమోతి, గడ్డేటి సుందర సునీల్, పిల్లి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు,


కరపత్రాన్ని ఆవిష్కరించిన అన్నవరపు కిషోర్

ధనుర్మాస మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాల పోస్టర్‌ను మంగళగిరి పట్టణ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పాత మంగళగిరి శ్రీ కృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం ఈ కార్యక్రమం ఆ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు నందం జోగేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీన అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం జీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థ గోష్ఠి, సాయంత్రం స్వామివారి అనుగ్రహ భాషణ, స్వామివారి శిష్యులు గోదాదేవి అమ్మవారి వైభవాన్ని కీర్తిస్తూ నిర్వహించే పలు కార్యక్రమాలు జరుగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వికాస తరంగిణి ప్రతినిధులు విజయలక్ష్మి, డోగిపర్తి శ్రీహరిరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వికాస తరంగిణి ప్రతినిధులు

నేడు ఎస్టీయూ విద్యాసదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో విద్యా సదస్సు, గుంటూరు జిల్లా శాఖ 78వ వార్షిక సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు మండలం చింతలపూడిలోని మొవ్వా గార్డెన్స్‌లో నిర్వహించనున్న సదస్సులో పలు సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

17న ఎయిమ్స్‌కు రాష్ట్రపతి

- ప్రథమ స్నాతకోత్సవానికి హాజరు కానున్న ద్రౌపది ముర్ము
- ఏర్పాట్లపై జిల్లా అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచనలు

లక్ష్మీపురం: మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవానికి ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై ఎయిమ్స్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎయిమ్స్ డైరెక్టర్ డా.మాదభనందకర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహలు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రముఖులు కూడా పాల్గొంటున్నందున భద్రతాపరంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం జరగబోయే ఆడిటోరియాన్ని పరిశీలించారు. విజయవాడ నుంచి ఎయిమ్స్‌కు రోడ్డు మార్గాన రాష్ట్రపతి రానున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషాను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు నియమించే వివిధ కమిటీల ఏర్పాట్లపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. విధులు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీమంతకుమార్ దాస్, డీసీహెచ్ ఎస్ మయానా మజీదాబి, ఆర్అండ్‌బీ ఈఈ విశ్వనాథ్ రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ డా కె.విజయలక్ష్మి, డీఎస్ఓ పి.కోమలి పద్మ, పౌర సరఫరాల శాఖ డిస్ట్రిక్ మేనేజర్ జి.లక్ష్మి, ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, అడిషనల్ ప్రొఫెసర్ శంకరన్, ఐపీఆర్ ఆర్‌జేడీ ఐ.సూర్యచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.


ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎయిమ్స్ అధికారులు

పారిశుద్ధ్య పనులు ముమ్మరం


సిబ్బందికి సూచనలిస్తున్న అలీంబాషా

మంగళగిరి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో మంగళగిరి ఎయిమ్స్ రోడ్డులో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది కంప చెట్లు తొలగించారు. రోడ్డును శుభ్రపరిచారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీంబాషా ఆయా పనులను పర్యవేక్షించారు.

అందుబాటులో సహాయక సిబ్బంది

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'పొలాల్లో ధాన్యం... పోరే శరణ్యం' శీర్షికన 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషనులో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన ప్రతి క్లస్టర్‌లోనూ టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ వెల్లడించారు. ధాన్యం సేకరణకు ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీగా నియమించిన జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ ఆ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచామన్నారు. కొల్లిపర మండలం తూములూరు రైతు సేవా కేంద్రం ద్వారా 117 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.28 లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలియజేశారు. రైతులెవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, రైతు సేవా కేంద్రాలలో కనీస మద్దతు ధరకు విక్రయించాలని కోరారు. సమస్యలు ఎదురైతే నేరుగా జిల్లా కంట్రోలు రూము 94913 92717 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 156 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు నిమిత్తం 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేశామని వివరించారు.

ఫారెస్ట్రీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు

రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం



ఏఎన్‌యూ: ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సు చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అన్నారు. యూనివర్సిటీ వృక్ష శాస్త్రం, ఫారెస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం హెర్బల్ గార్డెన్‌లో షెడ్ నెట్, పాలీహౌస్‌లను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫారెస్ట్రీ కోర్సు నడుపుతున్న ఏకైక విశ్వవిద్యాలయం తమదేనన్నారు. విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే చూడకుండా స్వయంగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసి అనేక మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. విశిష్ట అతిథిగా ఐఎఫ్ఎస్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ.. పెరిగిపోతున్న కాలుష్యం వలన భూతాపం పెరిగి వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కాప్ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టులో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఎస్సీ ఫారెస్ట్రీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ ఏపీ ఫారెస్ట్రీ విభాగంతో సంయుక్తంగా ఈ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ మాధవి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్ రాజు, పలువురు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎంసీలో పట్టణ ప్రణాళిక ఓపెన్ ఫోరం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సిటీ ప్లానర్ చాంబర్‌లో కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సిటీ ప్లానర్ రాంబాబు ఓపెన్ ఫోరం నిర్వహించారు.

ఐఏఎల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరణలో న్యాయవాదులు

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.నరసింహారావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు నంద, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ సీనియర్ ఈఎం ఎస్‌బీఏ ద్దూన్సీ, మాజీ అధ్యక్షులు కేవీకే సురేష్, సభ్యులు కె.నరసింహం, వేముల జయపాల్, కె.అంబిక, వి.లక్ష్మీతిరుపతమ్మ, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం టేబుల్, పాకెట్ క్యాలెండర్లను న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు అందజేశారు. కోర్టుకు సంబంధించిన సెలవు దినాలతో ముద్రించిన క్యాలెండర్ అందరికీ ఉపయుక్తంగా ఉందని వక్తలు తెలిపారు.

రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా


రజత్ బాగెల్ (87 పరుగులు)


రాహుల్ (21 పరుగులు)


మొహ్మద్ షాహిద్

మంగళగిరి: విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్ –16లో రాజస్థాన్, ఉత్తరాఖండ్ మధ్య క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో 266 పరుగులు చేసి ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ యశ్వంత్ భరద్వాజ్ 50 పరుగులు సాధించగా, షైఫన్ ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు నియాన్ త్యాగి, మెహ్మద్ షాహిద్‌లు చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 102.5 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. ఉత్తరాఖండ్ బ్యాట్స్‌మెన్‌లు అభిమన్యు 75 , అనయనేగి 71, కుషేగ్ర జెడ్ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్లు మిరాన్ ఖాన్, సుజాల్ ఫర్మార్ 3 వికెట్ల చొప్పున తీశారు. రాజస్థాన్ రెండవ ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 243 పరుగులు సాధించింది. రజత్ బాగెల్ 86, రాహుల్ 81, సైఫన్ ఖాన్ 51 పరుగులు సాధించారు. దీంతో మ్యాచ్ డ్రా అయింది. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించడంతో మూడు పాయింట్లు సాధించింది. రాజస్థాన్ ఒక పాయింట్ పొందింది.